క్లుప్తంగా

నేడు సుబ్బరాజు చెరువు బహిరంగ వేలం

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారి పాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సుబ్బరాజు చెరువును సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పంచాయతీ కార్యాలయంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బహిరంగ వేలంలో పాల్గొనే వారందరు దరావత్తు డిపాజిట్ నగదు రూ.1,38,750 చెల్లించి రశీదు పొంది వేలంలో పాల్గొనాలన్నారు. బహిరంగ వేలంలో చుట్టు పక్కల గ్రామ ప్రజలకు దండోరా ద్వారా తెలియజేశామన్నారు.

మాతాశ్రీ హాస్పిటల్‌లో 'హెర్నియా లైవ్ సర్జన్'
ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ



నరసరావుపేట: వినుకొండరోడ్డు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మాతాశ్రీ హాస్పిటల్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, డాక్టర్ సరితల ఆధ్వర్యంలో ఆదివారం ఐఎంఏ భవనంలో అడ్వాన్స్‌డ్ లాప్రోస్కోపిక్ హెర్నియా సర్జన్‌పై సీఎంఈ లైవ్ వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. లైవ్‌లో నిర్వహించిన హెర్నియా ఆపరేషన్‌ను పలువురు డాక్టర్లు హాజరై తిలకించారు. కాటూరి, ఎన్ఆర్ఐ, మణిపాల్ హాస్పిటళ్ల నుంచి పలువురు స్పెషలిస్టు డాక్టర్లు హాజరై హెర్నియా ఆపరేషన్లలో వచ్చిన ఆధునాతన టెక్నాలజీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ మాజీ కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ పీఎస్ దత్తు, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్లు కారసాని శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పువ్వాడ సూర్యనారాయణ, కట్టా రమేష్, మోహన్‌శేషు, యనమదల శ్రీహర్ష పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

రొంపిచర్ల: మండలంలోని రైతునగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు డ్రైన్‌కు శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. కూటమి నాయకులు బోయపాటి వాసు, శాకమూరి రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి
ఏపీటీఎఫ్ డిమాండ్

నరసరావుపేట ఈస్ట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను వెంటనే ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) పల్నాడుజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జం సంపత్‌బాబు, పమ్మి వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలనీ, 12వ పీఆర్‌సీ ఛైర్మన్‌ను వెంటనే నియమించాలని కోరారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలో పీఎఫ్, ఏపీజీఎల్ఐ మినహాయింపుల రూపంలో దాదాపు రూ.2500కోట్లు ఖజానాకు చేరిందన్నారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న ఆర్థిక అవసరాలను తీర్చేందుకు మంజూరు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులపై యాప్‌లు, అపార్ ఒత్తిడిని తగ్గించాలని డిమాండ్ చేశారు. కాగా, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈనెల 20వ తేదీన జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

విద్యారంగాన్ని పరిరక్షించుకోవాలి



నరసరావుపేట ఈస్ట్: విద్యారంగ పరిరక్షణ కోసం బాధ్యతగా పనిచేద్దామని వక్తలు తెలిపారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల్లో భాగంగా పల్నాడుజిల్లా మహాసభలు నిర్వహించారు. మహాసభకు యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సభలో ఎమ్మెల్సీలు కె.ఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ, పల్నాడు ప్రాంతం ఆర్థిక, విద్య రంగాలలో వెనుకబడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. తొలుత స్వర్ణోత్సవ మహాసభల్లో భాగంగా జాతీయ, యూటీఎఫ్ పతాకాలను ఆవిష్కరించి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి, యూటీఎఫ్ పత్రిక ఎడిటర్ కుమార్‌రాజా, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందరరావు పాల్గొన్నారు.

• ఆహ్లాదం



టగ్ ఆఫ్ వార్ ఆడుతున్న మహిళలు



అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తున్న భక్తబృందం

ఉల్లాసం...ఉత్సాహం... భక్తిశ్రద్ధలతో కార్తికమాసం చివరి ఆదివారం గడిచింది. వివిధ వ్యాపార సంఘాలు, భక్తులు కార్తిక వన సమారాధన నిర్వహించారు. పురుషోత్తమపట్నంలోని ఉసిరి తోట ఈ కార్తిక వన సమారాధనకు వేదికగా నిలిచింది. మహిళలు పూజల అనంతరం టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, షటిల్ బాడ్మింటన్ వంటి ఆటలతో సందడి చేశారు. భక్త బృందాలు అన్నమయ్య కీర్తనలతో రంజింపచేశారు. యువకులు కబడ్డీ, క్రికెట్ వంటి ఆటలు ఆడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. చిలకలూరిపేట ప్రెస్ క్లబ్ ఏపీయూడబ్ల్యూజే శాఖ ఆధ్వర్యంలో కార్తికవన సమారాధన నిర్వహించారు.

– చిలకలూరిపేట

• అధ్వానం



చినతురకపాలెంలో రహదారికి ఏర్పడిన గోతులు

అధ్వానంగా చినతురకపాలెం–గోనెపూడి రహదారి

మండలంలోని చినతురకపాలెం – గోనెపూడి రహదారి అధ్వానంగా మారింది. గోతులమయంగా మారిన రోడ్డులో వాహనాల రాకపోకలు కష్టంగా మారింది. గోనెపూడి, చింతలపాలెం, చినతురకపాలెం గ్రామాలకు చెందిన వారు ఈ రహదారిని వినియోగిస్తుంటారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతింది. పలు చోట్ల గోతులు ఏర్పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చినతురకపాలెం గ్రామంలో అయితే పెద్ద గోతులు ఏర్పడ్డాయి. మూడు గ్రామాల ప్రజలతో పాటు ఆర్టీసీ, ప్రైవేటు స్కూల్ బస్సులు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తుంటాయి. చింతలపాలెం, గోనెపూడి గ్రామాల నుంచి విద్యార్థులు యల్లమంద హైస్కూల్‌కు రావాలంటే ఈ రహదారి నుంచి ప్రయాణించాల్సి ఉంది. గోతుల కారణంగా రాత్రి సమయంలో రోడ్డును వినియోగించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన రహదారికి మరమ్మతులైనా నిర్వహించాలని మూడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– నరసరావుపేట రూరల్

రంగనాయక స్వామి ఆలయంలో దీపార్చన



యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీభూసమేత రంగనాయకస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తిక అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకుని రంగనాయకస్వామి, ఉపాలయంలో కొలువున్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయాల్లో దేవతా మూర్తులకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పర్చూరి రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రంగవల్లులు, పుష్పాలతో వివిధ రూపాలను రూపొందించి ప్రమిదలు ఏర్పాటు చేసిన దీపార్చన చేశారు.

రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. పొలంలో విత్తనం వేసే ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. విత్తనం వేసిన 30 రోజుల పాటు దాని ప్రభావం మొక్కపై ఉంటుందని, ఎటువంటి చీడపీడలను మొక్కకు ఆశించకుండా కాపాడుతుందన్నారు. విత్తన శుద్ధితో పాటుగా జీవన ఎరువుల వాడకం, తయారీ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు కె.అఖిల, ఆర్యహరి, జి.చైత్రిక, షేక్ అయిషా, టి.భువనేశ్వరి, టి.శ్వేత, కె.దివ్య పాల్గొన్నారు.

'సాగునీటి' ఎన్నికలకు వేళాయె!

- ఈనెల 8న సాగునీటి సంఘాల ఎన్నికలు
- జిల్లాలో 274 సంఘాలకు జరగనున్న ఎన్నిక



గంటావారిపాలెం ఏబీసీ కెనాల్

శావల్యాపురం: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో 11 లక్షల ఆయకట్టు సాగు భూమి ఉండగా అందులో మాచర్ల, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల పరిధిలో 5 లక్షల 60 వేల ఆయకట్టు సాగు భూమి ఉంది. వీటి పరిధిలోని 274 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను రెవెన్యూ అధికారుల సారథ్యంలో ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. ఎన్ఎస్‌పీ రికార్డుల్లో నమోదు కాబడిన సర్వే నంబరు, ఆయుకట్ట భూములు ఆధారంగా సంబంధిత రైతుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఒక్కో సాగునీటి సంఘానికి 12 మంది టీసీ(టెరిటోరియల్ కాన్‌స్టెన్సీ) అధ్యక్షులు ఉంటారు. 12 మంది టీసీ అధ్యక్షులు సంయుక్తంగా నీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు.

గంటావారిపాలెం సెక్షన్ పరిధిలో 11 సంఘాలు..

మండలంలోని గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 11 సాగునీటి సంఘాలకు అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. గంటావారిపాలెం సెక్షన్ పరిధిలో 11 సాగునీటి సంఘాలు ఉన్నాయి. (204–214), వేల్పూరు, అలవాల, శానంపూడిలలో –01, పోట్లూరు, కనమర్లపూడి, శానంపూడి–02, కామేపల్లి, మతుకుమల్లి, ఏనుగుపాలెం 01, ఏనుగుపాలెం–02, కారుమంచి, ఒక్కో సాగు నీటి పరిధిలో 7 టీసీలు ఉంటాయి. ఒక్కో సాగు నీటి సంఘం పరిధిలో 2 వేల ఎకరాల సాగు భూమి ఉంటుంది. ఆయకట్టు ఆధారంగా టీసీల ఎన్నిక జరుగుతుంది. ఈసందర్భంగా ఎన్ఎస్‌పీ డీఈ జరుగుల విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఈనెల 8వ తేదీ సాగునీటి సంఘాల ఎన్నిక ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు.

257 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వివేకానందరెడ్డి

రొంపిచర్ల: బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకొని కళ్ల జబ్బులు రాకుండా చూసుకోవాలని శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని వీరవట్నంలో ఆదివారం చల్లా సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ఎంవీ రెడ్డి ఐ హాస్పటల్ డాక్టర్ వివేకానందరెడ్డి మాట్లాడుతూ టీవీలు, మొబైల్ వాడకం వల్ల కంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయన్నారు. అవసరమైన వారందరూ తప్పనిసరిగా కళ్లజోళ్లు ధరించాలన్నారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకొని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ శిబిరంలో 257 మందికి కంటి వైద్యపరీక్షలు నిర్వహించి 17 మందికి శుక్లాలు, 12 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు. వ్యాధి నిర్ధారణ అనంతరం కళ్లజోళ్లు, మందులు పంపిణీ చేశారు. ఇంటూరి ప్రసాదు, జాస్తి ప్రసాదు, మాలపాటి పెదకొండలు, శాకమూరి రామూర్తి, పల్లెల నాగిరెడ్డి, ఎంవీ రెడ్డి హస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సాతులూరులో కంటి వైద్యశిబిరం

నాదెండ్ల: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని సాతులూరు గ్రామంలో ఉన్న ఈతరం పబ్లిక్ స్కూల్‌లో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 112 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, ఇందులో 58 మందిని కంటి శుక్లాల శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు.

ఎంపిక చేసిన వారిని సోమవారం ఉదయం 10 గంటలకు ఈతరం పబ్లిక్ స్కూల్ నుంచి శంకర కంటి వైద్యశాలకు బస్సులో తరలించి ఆపరేషన్లు నిర్వహిస్తారు. డాక్టర్ చింతన్, శంకర కంటి వైద్యశాల ఎగ్జిక్యూటివ్ కన్వీనర్ సైదులు, ఈతరం పబ్లిక్ స్కూల్ డైరెక్టర్లు బండారుపల్లి సత్యనారాయణ, పాటిబండ్ల శివరామకృష్ణ ప్రసాద్‌బాబు, బండారు పల్లి మస్తాన్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు మౌలాలి

నరసరావుపేట: రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పుడు అధికారంలో వచ్చిన ఆర్నెల్లులోనే చార్జీలు పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటమంటే ప్రజలను మోసం చేయటమే అవుతుందన్నారు.. 2023–24ఏడాదికి సంబంధించి రూ.7,912కోట్ల ఇంధన సర్దుబాటు ఛార్జిల భారం ప్రజలపై పడనున్నాయన్నారు. ఒక్కో యూనిట్ 92పైసలు చొప్పున 2026 వరకు వసూలు చేయనున్నారన్నారు. సీఎం తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యుత్ చార్జీలు పెంచబోమని అవసరమైతే తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు గెలిచాక సామాన్య ప్రజల నడ్డి విరిచే విధంగా విద్యుత్ చార్జీలు పెంచడం ఏంటని ప్రశ్నించారు. ఆ మాటలు నమ్మి ఓట్లేసి ప్రజలు ఇప్పుడు మోసపోయామని భావిస్తున్నారన్నారు. చంద్రబాబు తీరు గెలిచేదాకా ఓడ మల్లయ్య గెలిచాక బోడి మల్లయ్య అనే విధంగా ఉందని, అలవి కానీ హామీలు ఇచ్చి ఒక్క హామీ కూడా సక్రమంగా నిలబెట్టుకోలేకపోతున్నారని మౌలాలి అన్నారు.

హెచ్ఐవీపై అందరికీ అవగాహన అవసరం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



ఎయిడ్స్‌డే ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: చికిత్సలేని హెచ్ఐవీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎయిడ్స్ మహమ్మారిని పారదోలేందుకు నివారణ ఒక్కటే మార్గమని వివరించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, వరల్డ్ ఎయిడ్స్ డే–2024 ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల వద్ద నుంచి బయలుదేరిన ర్యాలీలో దాదాపు వెయ్యి మంది వైద్య సంబంధిత విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల నర్సింగ్, జీఎన్ఎం, ఫిజియోథెరపీ విద్యార్థులు ర్యాలీలో భాగంగా నిర్వహించిన కళాజాత ఆకట్టుకుంది. పీఏఎన్‌సీ కళాశాలలో ఎయిడ్స్ అవగాహన కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను డాక్టర్ రవి ప్రారంభించారు. కాగా, ఏడాది కాలంగా విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచిన వారిని సత్కరించారు. అలాగే రంగోలి, వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ దయానిధి, శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రేణుకాదేవి, జీఎన్ఎం విభాగం ప్రిన్సిపాల్ బి.నీల్ పీటర్, బీపీటీ ప్రిన్సిపాల్ సిహెచ్ ధనలక్ష్మి, ఎన్‌జీఓ ప్రతినిధులు ఆనంద్‌బెంజిమిన్, లాజరస్, మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజుపాలెం: మండలంలోని పెద నెమలిపురి రైతు సేవా కేంద్రంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు వ్యవసాయాధికారి పి.వెంకటనర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, జిల్లా జాయింట్ కలెక్టర్ జీఎస్ ధనుంజయ్, అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

• నేలవాలిన ఆశలు



నేలవాలిన వరి దుబ్బులను కట్టలుగా కట్టి నిలబెట్టిన రైతులు

మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆదివారం కూడా చిరుజల్లులు కురిసాయి. ఆదివారం ఉదయానికి 2 ఎం.ఎం వర్షపాతం నమోదయిందని తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. వర్షానికి మాచవరం, సంతగుడిపాడు, విప్పర్ల, కొత్తపల్లి, రెడ్డిపాలెం, మర్రిచెట్టుపాలెం, ఎడ్వర్డ్‌పేట ఏరియాల్లో సాగవుతున్న వరి పొలం అక్కడక్కడా నేలవాలింది. ఏపుగా పెరిగిన వరిపైరులో ఈ పరిస్థితి నెలకొంది. బిర్రుపొట్టపై ఉన్న వరి నేల వారటంతో రైతులు వాటిని నాలుగు, ఐదు దుబ్బులు చొప్పున నిలబెట్టి కట్టలుగా కట్టి కాపాడుకొంటున్నారు. ఈ వర్షం ఇలాగే కొనసాగితే ఏపుగా పెరిగిన వరిపైరు నేలవారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

– రొంపిచర్ల

భక్తిశ్రద్ధలతో కార్తికమాస పూజలు



పట్టణంలో కోలాట ప్రదర్శనలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో మహంకాళి అమ్మవారు



గురప్పనాయుడుపాలెంలో పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పవిత్ర కార్తిక మాసంలో ఆఖరి రోజైన ఆదివారం స్వామివారి సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో వినాయక భజన, కోలామండలి వారిచే కోలాట ప్రదర్శనలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే సోమవారం తెల్లవారుజామున ఉదయం 5.30గంటలకు పోలిస్వర్గం మహిళా దంపతులు భక్తుల చేతుల మీదుగా దీపాలు వదిలే కార్యక్రమం, పోలీస్వర్గం కథ చెప్పడం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో అధ్యక్షులు రెడ్డి బంగారయ్య, సెక్రటరీ అచ్యుత కృష్ణ సుబ్బారావు, ట్రెజరర్ కాళ్ల రామకోటేశ్వరరావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నూజెండ్ల మండలంలో...

కార్తికమాసం అమావాస్య ఆదివారం సందర్భంగా నూజెండ్ల మండలంలోని గురప్పనాయుడు పాలెం గ్రామంలో అర్చకులు రామమోహన్‌ఆచార్యులు ఆధ్వర్యంలో శ్రీ సీతలంబా దేవి బొడ్రాయికి గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి, పోతురాజుకు విశేష అభిషేకం, విశేషాలంకరణ, గ్రామ పొంగళ్లు, సద్ది నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దెత్తున మహిళలు భక్తులు పాల్గొని అమ్మవారి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సీతారామస్వామి వారి యొక్క దేవస్థానంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అమ్మవారికి కార్తిక అమావాస్య పూజలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి ఆలయంలో కార్తిక మాసం అమవాస్యను పురస్కరించుకొని ఆదివారం విశేష పూజలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన కుంకుమార్చన, భక్తులు పాల్గొన్నారు. మహా చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పది మంది ఉభయదాతలు చండీ హోమంలో పాల్గొన్నారు. అమ్మవారికి విశేష పుష్పాలంకరణ సేవ జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ ఎస్.మాధవిదేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శౌరివారి ఉత్సవాలు ప్రారంభం



బొల్లాపల్లి: మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి పండుగ ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే పండుగ ఉత్సవాల్లో తొలి రోజు ఉదయం 9గంటలకు రెవ.ఫాదర్ ఎం.అనిల్‌కుమార్ ప్రార్థనలు చేశారు. దివ్య పూజా బలి కార్యక్రమంలో రెవ.ఫాదర్ వై. జాకబ్‌రెడ్డి, సహాయ విచారణ గురువులు పి.బాలచంద్ హాజరై పూజా బలి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం ...

రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరివారి ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో సుమారు 15 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు 3వ తేదీన ఫైనల్ పోటీలు నిర్వహిస్తామని, గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. అనంతరం సాయంత్రం 6గంటలకు డ్యాన్స్‌బేబీ డ్యాన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గ్రామప్రజలు, విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కె.ప్రభాకరరావు, వాలీబాల్ పోటీల నిర్వాహకులు రాజేశ్వరరావు, కె.ప్రకాశరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

స్త్రీల సమాజం అధ్యక్షురాలిగా ఎమ్మేల్యమ్మ

సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి స్త్రీల సమాజం నూతన ప్రెసిడెంట్‌గా గుజ్జర్లపూడి ఎమ్మెల్యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్‌గా మాచర్ల సువార్తమ్మ, సెక్రటరీగా కూచిపూడి సరళ, జాయింట్ సెక్రటరీగా గుజ్జర్లపూడి.మార్తమ్మ ఇశ్రాయేలు, ట్రెజరర్‌గా దర్శి మంజూష, వైస్ ట్రెజరర్‌గా కోట జయంతి, కార్యవర్గ సభ్యులుగా గుజ్జర్లపూడి లీలమ్మ, చౌటుపల్లి మాణిక్యం, గుజ్జర్లపూడి మార్తమ్మ బాబు, కొయ్యలమూడి రోజి, గుజ్జర్లపూడి అన్నమ్మ, వేమవరపు మరియమ్మ, గుజ్జర్లపూడి శ్రీదేవి, వెంకాయమ్మ(వడ్డవల్లి), గుజ్జర్లపూడి ఎస్తేరురాణి, పరిచారకులుగా గుజ్జర్లపూడి విక్టోరియా రాణి, చిలుక సుగుణ ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని బాధ్యులు తెలిపారు.